# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025






### పంచపాండవులకు పూజలు
పాడేరు గుడివాడ శిఖరంలోని ద్రౌపది సమేత పంచపాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో



### అప్పన్నకు ఆర్జిత సేవలు
సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. 8లో



### సిరులతల్లికి క్షీరాభిషేక సేవ
డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి
**పాడేరు రూరల్:** విద్యాప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకురాలు డి.మాధవి సూచించారు. పాడేరులోని తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జిల్లా వ్యాప్తంగా 53 పాఠశాలల హెచ్ఎంలతో పాటు మూడు సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో పాల్‌నోడల్ అధికారి సింహాచలం, సీఎంవో జ్ఞానప్రకాష్,ఎంఈవో-1 విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మల్లుదొర వారసులను విస్మరించడం అన్యాయం



ఆందోళన చేస్తున్న మల్లుదొర వారసులు

**కొయ్యూరు:** ఆదివాసీ స్వాతంత్ర్య పోరాట యోధుడు మల్లుదొరను, ఆయన వారసులమైన తమను ప్రభుత్వం, అధికారులు విస్మరించడం అన్యాయమని మల్లుదొర వారసులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు. మల్లుదొర వారసులమైన తమకు గృహాలు అందజేయాలని కోరుతూ శుక్రవారం కాకరపాడులో మల్లుదొర, అల్లూరి విగ్రహాల వద్ద ఆందోళన చేశారు. ఈమేరకు ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాలని గుడ్లపలి గ్రామానికి చెందిన కొప్పుల చంద్రవతి, కొత్తూరు లక్ష్మి నాల్గో తరం సంతానమైన రాజుబాబు, బాలమ్మ,లక్ష్మి, నాగమణి, కుమారి, విజయ కోరారు. ఈ సందర్భంగా మల్లుదొర, అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సేవా సంఘం మహిళా అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మరో ముగ్గురు జైలు అధికారులకు మెమోలు
**ఆరిలోవ(విశాఖ):** విశాఖ కేంద్ర కారాగారం అధికారులకు మెమోల జారీ కొనసాగుతోంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను గుర్తించి రాష్ట్ర జైళ్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార విశ్వజిత్ మెమోలు జారీ చేస్తున్నారు. ఈ నెల 18న నలుగురికి, 19న ఇద్దరికి మెమోలు జారీ చేయగా, శుక్రవారం జైలర్లు ఐ.మురళీ, టి.దుర్గారావు, ఎ.ఈశ్వరరావులకు కూడా మెమోలు అందజేశారు. దీంతో నాలుగు రోజుల వ్యవధిలో మెమోలు అందుకున్న అధికారుల సంఖ్య తొమ్మిదికి చేరింది. వీరిలో ఇక్కడ నుంచి అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్‌కు బదిలీ అయిన ఒక సూపరింటెండెంట్, నెల్లూరుకు బదిలీ అయిన అడిషనల్ సూపరింటెండెంట్, ప్రస్తుతం ఇక్కడే విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్‌తో పాటు ఇక్కడ విధుల్లో ఉన్న ఆరుగురు జైలర్లు ఉన్నారు. ఇంకా మరికొందరు అధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### చర్లపల్లి-దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు
**తాటిచెట్లపాలెం(విశాఖ):** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి-దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లువాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. చర్లపల్లి-దానాపూర్(07749) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదే రోజు రాత్రి 10.55 గంటలకు విజయనగరం చేరుకుంటుంది. అక్కడ నుంచి 11 గంటలకు బయలుదేరి సోమవారం తెల్లవారు 2 గంటలకు దానాపూర్ వెళ్తుంది. దానాపూర్-చర్లపల్లి (07750) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దానాపూర్‌లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

- చర్లపల్లి-దానాపూర్(07751) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మంగళవారం తెల్లవారు 2 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. దానాపూర్-చర్లపల్లి (07752) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దానాపూర్‌లో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఉందని డీసీఎం తెలిపారు.

**25న షాలిమర్- విశాఖ ఎక్స్‌ప్రెస్ రద్దు**

నిర్వహణ పనుల కారణంగా ఆయా మార్గాల్లో పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 25న సంత్రగచ్చి-చెన్నై సెంట్రల్(22807) ఎక్స్‌ప్రెస్, షాలిమర్-విశాఖపట్నం(22853) ఎక్స్‌ప్రెస్, 26న విశాఖపట్నం-షాలిమర్(22854) ఎక్స్‌ప్రెస్, 27న చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి (22808) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని సూచించారు.



పాడేరు-అరకు జాతీయ రహదారి



కొత్తపల్లి ప్రాంతంలో ..

# ఎన్‌హెచ్‌పై రయ్.. రయ్..




**సాక్షి,పాడేరు:** జిల్లా కేంద్రం పాడేరు నుంచి అరకులోయ వరకు 48.481 కిలోమీటర్ల జాతీయ రహదారి 516-ఇ నిర్మాణం పూర్తికావడంతో వాహనాల రయ్ రయ్ మంటూ పరుగులు తీస్తున్నాయి.గతంలో సింగిల్ రోడ్డు ఉండడంతో సుమారు రెండు గంటల పాటు ప్రయాణించే వాహనాలు ఇప్పుడు గంటలోనే అరకు-పాడేరు మధ్య నడుస్తున్నాయి. ఆర్టీసీబస్సులు కూడా వేగంగా నడుస్తున్నాయి.జాతీయ రహదారితో అరకు-పాడేరు మధ్య సురక్షిత ప్రయాణం సాధ్యమైంది.

**రూ.519.27 కోట్లతో నిర్మాణం**

రాజమండ్రి నుంచి నిర్మాణం చేపడుతున్న ఈ రోడ్డు జిల్లాలో రంపచోడవరం జంక్షన్, అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి, కొయ్యూరు, చింతపల్లి, లంబసింగి, జి.మాడుగుల, పాడేరు నుంచి అరకులోయలోని గొందిగుడ వరకు జరుగుతోంది. అక్కడి నుంచి విజయనగరం జిల్లాలో జరుగుతోంది. రాజమండ్రి నుంచి చేపట్టిన 253 కిలోమీటర్ల జాతీయ రహదారి 516-ఇ నిర్మాణాన్ని రూ.3వేల కోట్లతో గతంలో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.రాజమండ్రి నుంచి కొయ్యూరు,లంబసింగి,జి.మాడుగుల ప్రాంతాల్లో రహదారి నిర్మాణ పనులు జరుగుతుండగా, పాడేరులోని చింతలవీధి ప్రాంతం నుంచి అరకులోయలోని గొందిగూడ జంక్షన్ వరకు 48.481 కిలోమీటర్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి.అరకు సంతబయలు దాటిన తరువాత రైల్వేట్రాక్‌పై భారీ ఫ్లైఓవర్ వంతెన మినహా రోడ్డు పనులు పూర్తి కావడంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.మొత్తం రూ.519.27కోట్లతో ఈజాతీయ రహదారి పనులు జరిగాయి.



బర్మన్‌గూడలో ఎన్‌హెచ్‌పై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

**దూసుకుపోతున్న వాహనాలు**

పాడేరు-అరకులోయ జాతీయ రహదారి నిర్మాణం పూర్తవడంతో వాహనాలు రయ్ రయ్ అంటూ దూసుకుపోతున్నాయి. గంట వ్యవధిలోనే పాడేరు నుంచి అరకులోయ చేరుకోగలుగుతుండడంతో ప్రయాణికులు,పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. పాడేరు,హుకుంపేట,డుంబ్రిగుడ,అరకులోయ,పాడేరు మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలకు ప్రయాణం సుగమమైంది.

### ప్రమాదాలు తప్పాయి



జాతీయ రహదారి నిర్మాణంతో ప్రమాదాలు తప్పాయి.గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్న సమయంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగేవి. ప్రస్తుతం జాతీయ రహదారిగా అభివృద్ధి చెందడంతో గత 6 నెలల నుంచి ఒక్క ప్రమాదం జరగలేదు. వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నప్పటికీ విశాలమైన రోడ్డు కావడంతో రాకపోకలు సాఫీగా జరుగుతున్నాయి. సకాలంలో ప్రయాణానికి మార్గం ఏర్పడింది.

– పాంగి జగదీశ్వరరావు, ప్రైవేట్ డ్రైవర్, అరకులోయ

## పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు
### కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**పాడేరు :** జిల్లాలో టెన్త్, ఇంటర్ రెగ్యులర్, ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి, 144వ సెక్షన్ అమలు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 20 సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాలకు కిలోమీటర్ దూరంలో ఉన్న జెరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలు పరీక్షల సమయాల్లో మూసి వేయాలన్నారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని, అత్యవసర కారణాలతో కేవలం 15 నిమిషాల ఆలస్యాన్ని మాత్రమే అనుమతిస్తామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలకు ప్రతి కేంద్రానికి ఒక జిల్లాస్థాయి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు.తనతో పాటు జేసీ, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. జిల్లాలోని వివిధ యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తున్న 258 పాఠశాలల్లో 11,766 మంది విద్యార్థులు టెన్ పరీక్షలకు హాజరవుతారన్నారు. ఓపెన్ టెన్త్‌లో 1,297 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. మార్చి 17 నుంచి 31 వరకు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. టెన్త్ పరీక్షల నిర్వహణ కోసం 9490270788 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 6,518 మంది, రెండో సంవత్సరానికి 5,335 మంది, ఒకేషనల్ పరీక్షలకు 1,322 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఓపెన్ విధానంలో 1,699 మంది ఇంటర్ పరీక్షలకు హాజరవుతారన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు మార్చి ఒకటి నుంచి 20 వరకు, ఒకేషనల్ విద్యార్థులకు మార్చి 3నుంచి 15 వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీఈవో బ్రహ్మాజీరావు, జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి అప్పలరాము, సహాయ కమిషనర్(పరీక్షలు) శశికుమార్ పాల్గొన్నారు.

## పోస్టల్ ఖాతాలతో ఎన్నో ప్రయోజనాలు



ముంచంగిపుట్టులో అవగాహన కల్పిస్తున్న ఐపీవో లక్ష్మికిషోర్

**ముంచంగిపుట్టు:** పోస్టల్ పొదుపు ఖాతాలతో చాలా ప్రయోజనాలున్నాయని అరకు సబ్ డివిజనల్ ఐపీవో వి.లక్ష్మీకిషోర్ తెలిపారు. ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం పోస్టల్ సేవలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐపీవో లక్ష్మీకిషోర్ ఆధ్వర్యంలో పోస్టల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పొదుపు ఖాతాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు పోస్టల్ ఖాతాలను తెరిచారు. అనంతరం లక్ష్మీకిషోర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే పోస్టాఫీసులను వినియోగించుకోవాలన్నారు. పలు రకాల పొదుపు ఖాతాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటి ద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఎంవో ఎం.శ్రీను, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ,అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు లోహితాష్,శ్రీను, నీలిమ,గణపతి,జయప్రకాష్ పాల్గొన్నారు.

## ముంపు గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు



ముంపునకు గురవుతున్న చింతూరు గ్రామం

**చింతూరు:** పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురవుతున్న చింతూరు, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన 31 గ్రామాలకు సంబంధించి వచ్చేనెల 1, 3 తేదీల్లో ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు నిర్వహించనున్నట్లు పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళవందనం శుక్రవారం తెలిపారు. పరిహారం, పునరావాసం కల్పించడంలో భాగంగా గ్రామసభలు నిర్వహించి, ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తామని ఆమె తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తొలిదశలో చింతూరు డివిజన్లో 52 గ్రామాలు ముంపునకు గురవుతుండగా ఇప్పటికే 20 గ్రామాలకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ పూర్తయింది. మిగతా 32 గ్రామాల్లో కూనవరం మండలం లేళ్లవాయిలో ప్రస్తుతం ఎవరూ నివసించకపోవడంతో ఆ గ్రామాన్ని మినహాయించి మిగిలిన 31 గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ గ్రామాలకు సంబంధించి ఇళ్ల నష్ట పరిహారం నిమిత్తం సామాజిక, ఆర్థిక సర్వే పూర్తికాగా అవార్డు నోటీసులు సైతం అందజేశారు.

**సభలు నిర్వహించే గ్రామాలివే**

చింతూరు మండలంలో ఉలుమూరు, చింతూరు, మార్కండేయులుపేట, చూటూరు, ఏజీకొడేరు, మల్లెతోటల్లో సభలు నిర్వహిస్తారు. వీఆర్‌పురం మండలంలో అడవి వెంకన్నగూడెం, కన్నాయిగూడెం, రాజుపేట, రాజుపేట కాలనీ, వడ్డిగూడెం, ధర్మతాళ్లగూడెం, వీఆర్‌పురం, చొప్పల్లిలలో, కూనవరం మండలంలో వాల్ఫర్డ్‌పేట, కూళ్లపాడు, టేకుబాక, కూనవరం, టేకులబోరు, పెదార్కూరు, పంద్రాజుపల్లి, శబరికొత్తగూడెం, కొండ్రాజుపేట గ్రామాల్లో సభలు నిర్వహిస్తారు.

## సకాలంలో ధ్రువీకరణ పత్రాల జారీ
### కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన న్యాయమూర్తి స్వర్ణ



హాజరైన అధికారులు

**సాక్షి,పాడేరు:** జిల్లాలోని ప్రజలకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు.కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా న్యాయసేవల సంస్థ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీ సేవాసర్వీసెస్ ద్వారా 574 రకాల సేవలు అందిస్తున్నామని, సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. ప్రజలు గ్రామ సచివాలయాలను సందర్శించే సమయంలో డిజిటల్ సహాయకులు అందుబాటులో ఉండి,సకాలంలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆదేశించారు.ప్రజలను పదేపదే తిప్పవద్దన్నారు.జిల్లాలో అధికశాతం గిరిజనులే ఉన్నారని,వారిలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండడంతో వారంలో ఒకరోజు పౌరసేవలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలోను నిర్లక్ష్యం వద్దన్నారు.

**ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దు :న్యాయమూర్తి స్వర్ణ**

ప్రజలకు ధ్రువీకరణ పత్రాల జారీ చేయడంలో జాప్యం వద్దని,ఆలస్యంగా జారీ చేయడం వల్ల సకాలంలో ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారని జిల్లా న్యాయసేవా ప్రాధికారిక సంస్థ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ అన్నారు. ధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం కారణంగా కొన్ని సమయాల్లో డీఎల్ఎస్ఎకు కేసులు పెరగడం గమనించినట్టు చెప్పారు. ఫేక్ ధ్రువీకరణ పత్రాలు జారీ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.ఈకార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్,డీఆర్వో పద్మలత, డీపీవో లవరాజు,డీఎల్‌పీవో కుమార్,కలెక్టరేట్ పర్యవేక్షకుడు నాగరాజు,పాడేరు డివిజన్‌లోని తహసీల్దార్‌లు,ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## నిండు గర్భిణికి నరకయాతన
### డోలీలో ఏడు కిలోమీటర్ల తరలింపు



బందులపనుకు నుంచి డోలీలో గర్భిణిని తరలిస్తున్న బంధువులు

**జి.మాడుగుల:** రహదారి సరిగా లేకపోవడంతో ఓ నిండు గర్భిణిని ఏడు కిలోమీటర్లు డోలీపై మోయవలసి వచ్చింది. దీంతో ఆమె నరకయాతనకు గురైంది. మండలంలోని గడుతూరు పంచాయతీ బందులపనుకు గ్రామానికి చెందిన ఆదిమజాతి గిరిజన(పీవీటీజీ)తెగకు చెందిన పాంగి జ్యోతి నిండు గర్భిణి. ఆమెకు శుక్రవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు వచ్చాయి. అయితే ఆ గ్రామం నుంచి కొత్తూరు వరకూ ఏడు కిలో మీటర్లు సరైన రోడ్డులేదు. అంబులెన్స్ వచ్చే అవకాశం లేకపోవడంతో భర్త శ్రీను, కుటుంబ సభ్యులు డోలీలో ఆమెను కొత్తూరు వరకు అష్టకష్టాలు పడి తరలించారు. కొత్తూరు గ్రామం నుంచి ఆటోలో జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గ మధ్యంలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను అదే వాహనంలో జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారులు రవిచంద్రశేఖర్, ధనుష్‌లు వైద్యసేవలందించారు.

### మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు, విద్యార్థులు

**మారేడుమిల్లి:** తమ అభివృద్ధికి మావోయిస్టులు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ మారేడుమిల్లి మండలం ఆకుమామిడి కోట గ్రామంలో శుక్రవారం గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. అమాయకులైన గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్య చేస్తున్నారని, తమ జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## యువ క్రీడాకారులకు ‘ఎఫ్‌సీఐ’ ప్రోత్సాహం
**విశాఖ స్పోర్ట్స్:** మీరు ఔత్సాహిక క్రీడాకారులా? అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించాలనే పట్టుదలతో ఉన్నారా? అయితే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మీకు ఆర్థికంగా అండగా నిలవడానికి స్టైఫండ్‌ను అందిస్తోంది. ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్లో రాణిస్తున్న బాలురు, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ క్రీడల్లో రాణిస్తున్న బాలబాలికలు ఈ ప్రోత్సాహకాన్ని అందుకోవచ్చు. 15-18, 18-24 సంవత్సరాల వయసు గల వారు ఇందుకు అర్హులు. సిటీ లేదా గ్రామీణ ప్రాంతం అనే తేడా లేదు. మీరు అర్హులైతే వెంటనే www. fci. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించి, మార్చి 6వ తేదీలోపు మీ పేరును నమోదు చేసుకోండి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రీడా రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోండి.

## వియత్నాంలో భారత నేవీ నౌకలు



వియత్నాంలోని కామ్ రాన్ బే పోర్టుకు చేరుకున్న ఐఎన్ఎస్ టిర్, ఐసీజీఎస్ వీరా నౌకలు

**సింధియా(విశాఖ):** ఇండియన్ నేవీ ఫస్ట్ ట్రైనింగ్ స్క్వాడ్రన్‌కు చెందిన ఐఎన్ఎస్ టిర్, ఐసీజీఎస్ వీరా నౌకలు వియత్నాంలోని కామ్ రాన్ బేకు చేరుకున్నాయని నేవీ వర్గాలు తెలిపాయి. వియత్నాం నేవీ సిబ్బంది, అక్కడ భారత మిషన్ సభ్యులు ఈ నౌకలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య దీర్ఘకాల స్నేహాన్ని, సహకారాన్ని మరింతగా పెంచుతుందని నేవీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. సందర్శనలో భాగంగా నేవీ బృందాలు వివిధ కార్యకలాపాల్లో పాల్గొన్నాయి. పోర్ట్ కాల్, వివిధ క్రాస్-ట్రైనింగ్ కార్యకలాపాలు, వియత్నాం నావల్ అకాడమీ సందర్శన తదితర కార్యక్రమాలు జరిగాయి. వియత్నాం నేవీ, కోస్ట్ గార్డ్‌లతో ద్వైపాక్షిక విన్యాసాలతో ఈ పర్యటన ముగుస్తుందని నేవీ అధికారులు వెల్లడించారు.

### మనసు దోచె... మామిడి పూత



జిల్లాలో ఈ ఏడాది మామిడి చెట్లకు పూత ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పూతతో చెట్లు కళకళలాడుతున్నాయి. మామిడి పంటకు రూ. వేలల్లో గిరిజన రైతులు మదుపులు పెట్టి, మందులు పిచికారీ చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పూత అధికంగా ఉంది. ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని గిరిజన రైతులు ఆశిస్తున్నారు. ముంచంగిపుట్టు మండలంలో 58 హెక్టార్లలో మామిడితోటలు ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే పూతకు వచ్చాయి. వాతావరణం అనుకూలంగా ఉందని, మామిడి పూత ఆశాజనకంగా ఉందని, రానున్న రోజుల్లో పంట దిగుబడి పెరిగే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో దట్టంగా పూతతో ఉన్న చెట్టు పలువురిని ఆకట్టుకుంది.

– ముంచంగిపుట్టు

## క్లుప్తంగా

### కలెక్టర్ దినేష్‌కుమార్ ఔదార్యం



రమణమూర్తికి ఆర్థికసాయమందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: అనారోగ్యంతో బాధపడుతున్న చింతపల్లి ప్రాంతానికి చెందిన పి.వి.రమణమూర్తి అనే వృద్ధుడికి కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ వ్యక్తిగతంగా ఆర్థిక సాయమందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. బాధితుడు రమణమూర్తి కలెక్టర్ దినేష్‌కుమార్‌ను శుక్రవారం కలిశారు. తన అనారోగ్యం, ఇతర ఆర్థిక పరిస్థితులను కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్ తన సొంత సొమ్మును బాధితుడికి అందజేశారు. పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యం మెరుగుకు మందులు వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయమందించిన కలెక్టర్ దినేష్‌కుమార్‌కు బాధితుడు రమణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

### పీసా చట్టంతో గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ



మాట్లాడుతున్న అఖిల భారత్ గిరిజన హక్కుల మార్గదర్శకుడు గిరీష్ కుబీర్

ముంచంగిపుట్టు: పీసా చట్టంతో గిరిజన హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవచ్చని అఖిల భారత్ గిరిజన హక్కుల మార్గదర్శకుడు గిరీష్ కుబీర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం, వెలుగు కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పీసా కమిటీ సభ్యులకు ఇస్తున్న పీసా చట్టం శిక్షణ తరగతులను అఖిల భారత్ గిరిజన హక్కుల మార్గదర్శకుడు గిరీష్ కుబీర్ శుక్రవారం పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పీసా చట్టం పక్కగా అమలు జరగాలని, అప్పుడే గిరిజన చట్టాలు, హక్కులకు భద్రత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క గిరిజనుడు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ తరగుతులు ద్వారా ఎంతో మేలు కలుగుతుందన్నారు. అఖిల భారత్ హిత్‌రక్ష్ ప్రముఖ్ కులకర్ణి, సామర్లకోట ఫ్యాకల్టీ ప్రసాద్, న్యాయవాది మోహన్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

# దిల్ మ్యాంగో మోర్.!

- ఈసారి ఆశాజనకంగా మామిడి దిగుబడి
- కొమ్మల నిండా పూత
- గతేడాది ఎకరానికి 1.5 టన్నుల మామిడి దిగుబడి
- ఈ ఏడాది 3 టన్నుల వరకూ వచ్చే అవకాశం
- అదే బాటలో జీడిమామిడి దిగుబడి
- విశాఖ జిల్లాలో 3 వేల హెక్టార్లలో మామిడి, 1200 హెక్టార్లలో జీడిమామిడి సాగు



మామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు



మామిడి పూత

| | |
|---|---|
| జిల్లాలో మామిడి సాగు | 3,000 హెక్టార్లు |
| పద్మనాభం | 2000 హెక్టార్లు |
| భీమిలి | 50 హెక్టార్లు |
| ఆనందపురం | 400 హెక్టార్లు |
| పెందుర్తి | 50 హెక్టార్లు |
| సేంద్రియ సాగు | 30 హెక్టార్లు(పద్మనాభం) |
| గతేడాది ఎకరానికి దిగుబడి | 1.5 టన్నులు |
| ఈ ఏడాది అంచనా | 3 నుంచి 4 టన్నులు |
| జిల్లాలో జీడిమామిడి సాగు | 1200 హెక్టార్లు |
| పద్మనాభం | 400 హెక్టార్లు |
| సింహాచలం | 200 హెక్టార్లు |
| ఆనందపురం | 300 హెక్టార్లు |
| భీమిలి | 300 హెక్టార్లు |
| గతేడాది ఎకరానికి దిగుబడి | 150 కిలోలు |
| ఈ ఏడాది అంచనా | 250 కిలోలు |

సాక్షి, విశాఖపట్నం: గతేడాది నామమాత్రపు దిగుబడులు అందించిన మామిడి ఈసారి రైతుల్ని ఊరిస్తోంది. మొదటి దశలోనే మామిడిపూత విరబూసి అందరిలోనూ ఆశలు నింపుతోంది. జిల్లా వ్యాప్తంగా మామిడి తోటలు పూతలతో కళకళలాడుతున్నాయి. ముందుగానే పూతలు రావడం .. రెండో దశలోనూ నిలబడటంతో.. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కంటే ఈసారి దిగుబడి రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. మామిడి మాదిరిగానే... జీడి మామిడి కూడా భారీగా పూతతో రైతుల మోముల్లో ఆనందం నింపుతోంది.

**కలిసొస్తున్న అనుకూల వాతావరణం**

వాతావరణంలో చలితీవ్రత తప్ప.. అకాల వర్షాలు ఇంతవరకూ పడలేదు. దాదాపు ఏప్రిల్ చివరి వరకూ వానలు కురిసే సూచనలు కనిపించడం లేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పొగమంచు తీవ్రత కూడా భయపడేంతగా లేదు. ఏటా పొగమంచు ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఉండేది. ఈసారి జనవరి చివరి నుంచే పొగమంచు దాదాపు తగ్గిపోయింది. ఇది మామిడి పూతకు ఎంతో అనుకూల వాతావరణమని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా మామిడి పూత నవంబర్ నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది కొంచెం ముందుగానే పూత వచ్చింది. నవంబర్లో వచ్చిన మొదటి పూతతో పాటు డిసెంబర్లో ప్రారంభమైన రెండో దశ పూత కూడా బాగానే ఉంది. గతేడాదితో పోలిస్తే.. ఈసారి పెద్ద మొత్తంలో మామిడి పూత పూయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పూత నిలిస్తే మామిడి దిగుబడి భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

**ఆశాజనకంగా మామిడి, జీడి మామిడి దిగుబడి**

గతేడాది వాతావరణం అనుకూలించకపోవడం.. పొగమంచు, అకాల వర్షాల కారణంగా పూత నిలబడలేదు. ఈసారి పూత నిలబడటమే కాకుండా.. పలుచోట్ల పిందె స్థాయికి పంట చేరుకుంది. ఇదేరీతిలో వాతావరణం అనుకూలిస్తే.. దిగుబడి ఆశాజనకంగా ఉండనుంది. గతేడాది కంటే రెట్టింపు దిగుబడి వచ్చే సూచనలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. గత సంవత్సరం ఎకరానికి కేవలం ఒకటిన్నర టన్ను మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ సారి 3 టన్నుల వరకూ వస్తుందని ఉద్యానవన శాఖ అధికారుల అంచనా. అయితే.. తేనెమంచు(బంక తెగులు) పురుగు, నల్లిపురుగు, బూడిద తెగులు ఆశించకుండా జాగ్రత్తలు పాటిస్తే.. మరింత దిగుబడి రావచ్చని అధికారులు చెబుతున్నారు. జీడిమామిడిలో కూడా అద్భుతంగా పూత ఉందనీ.. దీని దిగుబడి గతేడాది కంటే పెరిగే సూచనలున్నాయని చెప్పన్నారు. గతేడాది ఎకరానికి 150 కిలోల దిగుబడి మాత్రమే ఉందనీ.. ఈసారి 250 కిలోలకు పైగా వచ్చే అవకాశాలున్నట్లు పేర్కొంటున్నారు.



**పిందెగా మారే సమయంలో జాగ్రత్తలు**

ప్రస్తుతానికి మామిడి, జీడిమామిడి పూత, పిందె దశలో అద్భుతంగా ఉన్నాయి. పూత పిందె కింద మారుతున్నప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ నీరు పెట్టకూడదు. నీరు పెడితే పిందె రాలిపోతుంది. నిమ్మకాయ సైజు వరకూ పెరిగిన తర్వాత మాత్రమే నీరు పెట్టాలి. పెస్ట్ మేనేజ్‌మెంట్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో లీటరు నీటిలో ఇమిడా క్లోరోపిడ్ 0.5 మి.లీ. 3 గ్రాముల బ్లీటాక్స్‌తో కలిపి పిచికారీ చెయ్యాలి. ఈ నెలాఖరులో లీటరు నీటిలో 2 మి.లీ. లామ్డా 10ఈసీ, 3 మి.లీ. కాంటాఫ్ కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది. పూత, పిందె నిలబడి దిగుబడి బాగా వస్తుంది. మరో నెలరోజులు వాతావరణం ఇదే తరహాలో అనుకూలంగా ఉంటే మామిడి తోటల రైతులు లాభాల బాట పడతారు. బయ్యర్ సెల్లర్ మీటింగ్ మే నెలలో నిర్వహిస్తాం.

– కె.సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

### పంచపాండవులకు పూజలు



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు: స్థానిక గుడివాడ శిఖరంలోని గతంలో ప్రతిష్ఠించిన ద్రౌపది సమేత పంచపాండవుల విగ్రహాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బిమ్మలపూజారి సింహాచలం ఆధ్వర్యంలో గుడివాడలోని అన్ని వర్గాల ప్రజలు పూజలు జరిపారు.పాతపాడేరు శివాలయం అర్చకుడు ఫణిశర్మ భక్తులతో ప్రత్యేక హోమం జరిపించారు. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు.

### అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం(విశాఖ) : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు.

అదేవిధంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం గరుడసేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి, విశేషంగా హారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

## గంజాయి రవాణా కట్టడికి సాంకేతిక పరిజ్ఞానం

**కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలెట్ ట్రిబ్యునల్ అధికారి రంగధామ్**



కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలెట్ ట్రిబ్యునల్ అధికారి ఏ రంగధామ్‌కు బొకే అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలెట్ ట్రిబ్యునల్ అధికారి ఏ రంగధామ్ తెలిపారు. స్థానిక గాంధీనగరం ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో శుక్రవారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీస్ సిబ్బందికి మాదకద్రవ్యాల నియంత్రణకు చట్టపరమైన అంశాలు, దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల కేసుల్లో శిక్షలు శాతం పెరిగేలా దర్యాప్తు చేయాలన్నారు. గంజాయి కేసుల దర్యాప్తులో తీసుకోవల్సిన మెలకువలు, జాగ్రత్తలను వివరించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నుంచి చార్జిషీట్ వేయడం వరకు అన్ని ప్రొసీజర్‌లను కచ్చితంగా పాటించాలన్నారు. ఏ ఒక్క ప్రొసీజర్‌ను పాటించక పోయినా కేసు పోతుందన్నారు. గంజాయి సీజ్ చేసినప్పుడు గెజిటెడ్ అధికారి ఆధ్వర్యంలో మధ్యవర్తుల సమక్షంలో చేయాలని సూచించారు. 161 స్టేట్‌మెంట్లు రికార్డు చేసిన తర్వాత వాటిని మధ్యవర్తులకు చదివి వినిపించాలన్నారు. గంజాయి శాంప్లింగ్ ప్రొసీజర్‌ను న్యాయమూర్తి సమక్షంలో చేయించాలని, తద్వారా నిందితులకు కోర్టులో శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదనపు ఎస్పీ ఎల్ మోహన్‌రావు, డీఎస్పీ బి. అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ దృష్టికి ఆస్పత్రి సమస్యలు



ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న రమణ

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పి.వి.రమణ తెలిపారు.ఆయన శుక్రవారం చింతపల్లి ఏరియా ఆస్పత్రిని సందర్శించారు.మొదట అక్కడ రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎల్‌టీ, స్టాఫ్‌నర్సులు, శానిటరీ వర్కర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రత్యేక వైద్యులు లేకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. చౌడుపల్లి,లంబసింగి పాఠశాలలను సందర్శించారు.అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అంతకుముందు చింతపల్లి గిరిజన భవన్‌లో గిరిజన ఉద్యోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ కో-ఆర్డినేటర్ నాగార్జున, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచెల రామకృష్ణ, నిర్వాహక కార్యదర్శి యు.వి. గిరి, చింతపల్లి మండల అధ్యక్షుడు బౌడు గంగరాజు, జిల్లా కార్యదర్శి గెమ్మెలి మోహన్, శశికుమార్, గూడెంకొత్తవీధి మండల ప్రధాన కార్యదర్శి జి. మల్లేశ్వరరావుతో పాటు కామేశ్వరరావు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.



## అన్ని ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

**మాతా, శిశు ఆరోగ్య సలహా కమిటీ సమావేశంలో విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**

మహారాణిపేట(విశాఖ): అన్ని ప్రైవేట్, ప్రభుత్వ, బోధనాస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మాతా, శిశు ఆరోగ్యం అడ్వైజరీ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి సరైన వైద్య సేవలు దక్కేలా వైద్యులు సహకారం అందించాలన్నారు. రోగులకు అందించే వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ కొన్ని మార్పులు చేయడం ద్వారా కేజీహెచ్‌లో మాతా, శిశు మరణాలు తగ్గాయన్నారు. సమావేశంలో కేజీహెచ్ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ చక్రవర్తి, అగనంపూడి పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ వి.సత్యప్రసాద్, కేజీహెచ్ అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ వి.రవి, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు డాక్టర్ లూసీ, డాక్టర్ బి.ఉమావతి, ఎస్.జయదేవి, డాక్టర్ గీతావందన, డాక్టర్ శ్రీదేవీ, ఐ.మనోరమ, బి.నాగేశ్వరరావు, బి.మురళీకృష్ణ, త్రినాథ్, షర్మిలాకుమారి పాల్గొన్నారు.

## పారా అథ్లెటిక్స్‌లో నేత్ర విద్యార్థుల ప్రతిభ




పతకాలు సాధించిన విద్యార్థులు

కొమ్మాది(విశాఖ): బీచ్‌రోడ్డులోని వారిజ ఆశ్రమ నేత్ర విద్యార్థులు 23వ జాతీయ పారా(దివ్యాంగుల) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఈ పోటీలు జరిగాయి. ఆశ్రమానికి చెందిన కిల్లాక లలిత టీ-11 కేటగిరీలో 400, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించింది. వలసనయిని రవళి టీ-11 కేటగిరిలో 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 400, 200 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాలు గెలుపొందింది. విజేతలను వారిజ నేత్ర విద్యాలయ కమిటీ సభ్యులు అభినందించారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే



వైద్య విద్యార్థులతో డీఎంఈ నరసింహం, ఇతర వైద్యులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే ను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన డీఎంఈ డాక్టర్ డి.ఎస్.వి.ఎల్. నరసింహం, శ్రీకాకుళం జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రవి వెంకటాచలం, పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, శ్రీకాకుళం జీఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మశ్రీలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకుని, ప్రజలకు నాణ్యమైన వైద్యంతో పాటు సేవా కార్యక్రమాలు చేయాలని వారంతా కోరారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన వైద్య విద్యార్థులంతా ఆటపాటలతో సందడి చేశారు. డీఎంఈ నరసింహంను ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ లక్ష్మికుమారి, డాక్టర్ పాపరత్నం, గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ తమర్బ నరసింగరావు, వైద్యులు పాల్గొన్నారు.

## 600 కేజీల గంజాయి స్వాధీనం

**విలువ సుమారు రూ.30 లక్షలు**



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాయకరావుపేట: గోపాలపట్నం గ్రామం సూదికొండ శివారులో 600 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. సరకు విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని చెప్పారు. పాయకరావుపేట పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూదికొండ సమీపాన గంజాయి నిల్వ ఉందన్న సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ, పోలీసు సిబ్బంది ప్రదేశానికి చేరుకొని, 19 గోనె సంచుల్లో ఉన్న 600 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, ఒక కారు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో గల గుంటపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఏజెన్సీ నుంచి గంజాయిని తెప్పించి ఇతర రాష్ట్రాలకు అమ్ముతాడని, ఈ క్రమంలోనే ఒడిశా ప్రాంతంలో ఒక గ్రామం నుండి జీకే వీధి మండలం మొండిగడ్డకు చెందిన వ్యక్తితో ఐదు లక్షలకు బేరం కుదుర్చుకున్నాడని చెప్పారు. సుమారు 600 కేజీల గంజాయిని మరో ఇద్దరు వ్యక్తుల సహాయంతో సేకరించి.. వ్యాన్‌లో ఇద్దరు డ్రైవింగ్ చేసుకుంటూ, మరో ఇద్దరు పల్సర్ బైక్‌పై వారి ముందు పైలెట్ చేసుకుంటూ సీలేరు నుంచి పాయకరావుపేట తీసుకువచ్చారు. ప్రధాన నిందితుడు గతంలో తనకు జైలులో పరిచయమైన ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులతో బేరం కుదుర్చుకుని అమ్ముతుంటాడని, ఈ క్రమంలోనే చెన్నైకి చెందిన బాస్ అనే వ్యక్తికి సుమారు 145 కేజీల గంజాయి సరఫరా చేయడం కోసం గుంటపల్లికి చెందిన వ్యక్తి అడ్వాన్స్ తీసుకుని పంపించడానికి సన్నాహాలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఐదుగురు వ్యక్తుల సమాచారం మేరకు, మరో ముగ్గురు వ్యక్తులను పీఎల్ పురం వద్ద అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. గుంటపల్లికి చెందిన మొదటి నిందితుడు, గంజాయి కొనుకున్న వ్యక్తికి మధ్య లావాదేవీలు చేస్తున్న నర్సీపట్నానికి చెందిన మరో వ్యక్తితో గంజాయి వ్యాపార ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. గంజాయిని, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సీఐ జి.అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం, హెచ్‌సీ శ్రీనివాసరావు, పీసీ సతీష్, సూరిబాబులకు, హోంగార్డ్ మదీనాకు ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసా పత్రాలను అందించారు.

## భూ కుంభకోణ నివేదికను బయటపెట్టండి

- బురదజల్లడం కాదు ఆరోపణలు నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..
- గ్రూప్–2 అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- కూటమి ప్రభుత్వం తొలిసంతకం చేసిన మెగా డీఎస్సీపై స్పష్టతే లేదు
- మీడియాతో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే తైనాల

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో భూ కుంభకోణాలకు సంబంధించి జరిపిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని ఏపీ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఊరికే బురదజల్లడం కాదు.. ఆరోపణలను నిరూపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని.. ఇదే వేదికపై నుంచి అనేక సార్లు ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వానికి నచ్చినట్లే 2004 లేదా 2014 ఏ సంవత్సరం నుంచి అయినా విచారణ జరిపిన నివేదికను బయటపెట్టాలన్నారు. శుక్రవారం లాసన్స్‌బేకాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు.

గుంటూరు మిర్చియార్డ్‌లో గిట్టుబాటు ధర లేక, దళారీ విధానంతో ఇబ్బందుల పడుతున్న రైతులను పరామర్శించడానికి మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళితే చట్ట వ్యతిరేక కార్యక్రమంటూ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగానే చంద్రబాబు విజయవాడలో మ్యూజికల్‌నైట్‌లో పాల్గొన్నారని, కోడ్ ఉన్నప్పుడే యూనివర్సిటీలకు వీసీ నియామకాలు చేపట్టారని గుర్తు చేశారు.

ఢిల్లీలో బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి వెళ్లిన చంద్రబాబు, మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో మాట్లాడేందుకు వెళ్లినట్లు అబద్ధాలు చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రి లేరన్న విషయం ముందుగానే తెలియదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించిన దాఖలాల్లేవన్నారు.

**నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమా..?**

గ్రూప్–2 మెయిన్స్ రోస్టర్ పాయింట్ సమస్యలపై ఉన్న అభ్యంతరాలను సహేతుకంగా పరిష్కరించాలని కోరారు. నోటిఫికేషన్ ఇచ్చిన గత, తమ ప్రభుత్వంపై నెట్టేయకుండా నిరుద్యోగుల భవిష్యత్తుపై దృష్టిసారించాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసిన డీఎస్సీ పరిస్థితే వాయిదాల మీద వాయిదాలు పడుతుంటే.. కూటమి పార్టీలు ఇచ్చిన హామీల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలకు అర్థమవుతోందన్నారు.

## రైల్వే కార్మికుల 'డిమాండ్ డే' నిరసన

తాటిచెట్లపాలెం(విశాఖ): ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ దేశవ్యాప్త పిలుపు మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ్ డే నిర్వహించారు. దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో కార్మికులు, యూనియన్ నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు సమస్యల పరిష్కారం కోసం వినతులు ఇస్తున్నా, రైల్వే శాఖ పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. ఓపీఎస్‌లో ఉన్న అన్ని అన్ని ప్రయోజనాలతో యూపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పాయింట్స్ మెన్ కేటగిరీ ఉద్యోగులకు 4గ్రేడ్ పే అమలు, ఉద్యోగుల పిల్లలకు ఉన్నత చదువుకు ఎడ్యుకేషనల్ అలవెన్సులు తదితర 50 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ అధ్యక్షుడు పీవీజీ రాజు, కార్యదర్శి బి.దామోదరరావు, ఆర్‌పీఎస్ఎస్ రావు, వెల్ఫేర్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు ఎం సన్యాసిరావు, గౌతం దేవ్, ఇతర కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు పాల్గొన్నారు.